## క్లుప్తంగా...

### రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్‌పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ అన్నారు. సోమవారం నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గం సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీటిని ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం పాలకవర్గం ఆమోదం తీసుకున్నట్లు వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యలపై తపస్ వినతి



వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

మేడ్చల్: ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ తపస్ సంఘం నేతలు తహసీల్దార్ సరితకు వినతి పత్రం అందజేశారు. తహసీల్ కార్యాలయంలో ఆమెను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. సీపీఎస్ రద్దు కోసం తమ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా సాగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు నవీన్, వెంకటరమణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

### కరెంట్ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ ఉమానాగారాజు

మేడ్చల్: తమ వార్డు పరిధిలో నెలకొన్న కరెంట్ సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ ఉమానాగారాజు ఏఈ శశిధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ చెక్‌పోస్ట్‌లోని ఏఈ కార్యాలయానికి ఆమె వెళ్లి వినతి పత్రం అందజేశారు. కాలనీల్లో ప్రజలు లో ఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నారని 100కేవీ సామర్థ్యంతో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను 160 కేవీకి మార్చాలని కోరారు.

### కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి

కీసర: మండలంలోని వివిధ గ్రామపంచాయతీల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం, పాలకులు వెంటనే పరిష్కరించాలని భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. బీజేపీ నేతలు అబ్రబోయిన జంగాలు, గోసుల శ్రీనివాస్, నల్ల వెంకట్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గం వేణుగోపాల్‌యాదవ్ ఉన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మేయర్ కావ్య అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రగతి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనుల కోసం రూ.58 లక్షలతో తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఆర్వో ప్రభాకర్‌యాదవ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



జవహర్‌నగర్‌లో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నేషనల్ ఆకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు స్వయం కృషితో ముందుకు సాగాలన్నారు. మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఉపాధి కల్పనలో రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, న్యాక్ అదనపు డైరెక్టర్ అంజయ్య, ఆఫీసర్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు ఏకె.మురుగేష్, లలితాయాదవ్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, కారింగుల నిహారికగౌడ్, మెట్టు ఆశాకుమారి, లావణ్యసతీష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, శారదామనోధర్‌రెడ్డి, పల్లపు రవి, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

#### పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని తహసీల్దార్ మీటింగ్ హాలులో కాప్రా తహసీల్దార్ అనిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డితో కురుమ సంఘం నేతలు

#### గుడి నిర్మాణానికి సహకరించాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని బీరప్పగుడి పునర్నిర్మాణం చేపట్టాలని మండల కురుమ సంఘం నేతలు మంత్రి మల్లారెడ్డిని కలిసి విన్నవించారు. కురుమ సంఘం నేతలు, కులస్తులు మంత్రి మల్లారెడ్డి నివాసానికి భారీ సంఖ్యలో తరలివెళ్లి గుడి నిర్మాణానికి సహకరించాలని కోరారు. సొంత నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కౌన్సిలర్ కౌడే మహేష్, సంఘం నాయకులు శంకర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

#### అభివృద్ధికి తమవంతు సహకారం

శామీర్‌పేట్: అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలో ఆయన పర్యటించారు. కేశవరం గ్రామంలోని పెద్దమ్మతల్లి, పోచమ్మ తల్లి ఆలయాల అభివృద్ధికి రూ.4 లక్షలను విరాళంగా కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి ఆదేశాల మేరకు తన సొంత నిధులతో కేశవాపూర్ గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, సర్పంచ్‌లు జ్యోతి, జాంరవి, హరిమోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ నాగరాజు, హన్మంత్ రెడ్డి, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

#### కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కీసర: పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు కీసర మండల పరిషత్ కార్యాలయంలో సుమారు 249 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్) ఆధ్వర్యంలో 90 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నాక్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టులో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం చీర్యాల గ్రామపరిధిలోని రోడ్డు విస్తరణ, బీటీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్లు బండారి మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానం కోసం పోరాడుదాం



సాక్షి, మేడ్చల్ జిల్లా: సెప్టెంబర్ 2004 నుంచి నియమించబడిన ఉద్యోగులకు కాంట్రిబ్యుటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజేందర్ మార్గదర్శకాలతో మేడ్చల్ జిల్లాలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు బి.రవిప్రకాష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఆఫీస్‌బేరర్లు, వివిధ యూనిట్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వేతనం రూ.15 వేల నుంచి రూ.28,719 పెంచాలని రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు నెల వేతనం రూ.28,719 పెంచి, మేడ్చల్ జిల్లాలోనే పెంచకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ఔట్ సోర్సింగ్ కార్యదర్శులతో భర్తీ చేయాలని ఆయన కోరారు. టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భరత్‌కుమార్‌ను నియమించినట్లు ఆయన ప్రకటించారు. సమావేశంలో టీఎన్‌జీవోస్ నాయకులు ఈశ్వర్, శశికాంత్, రవిచంద్ర, పద్మ, రజిని, శ్రీచంద్, జేమ్స్, దాస్, గిరికాంత్, శ్రీనివాస్, రాంచంద్రం, అరుణ, భాస్కర్‌గౌడ్, రాంరెడ్డి, అనిత, సతీష్, సత్యం, ప్రకాష్, శ్రీకాంత్ డేనియల్, నిర్మలాకుమారి పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై శ్రద్ధ కనబర్చాలి



జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన 63 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు వేదికగా ఉన్న ప్రజావాణి కార్యక్రమంపై సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్‌లో ఎలాంటి దరఖాస్తులను ఉంచకూడదని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజావాణిలో లాఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థులకు ఆర్థిక భారం కాకూడదని..



ఘట్‌కేసర్: జెడ్పీ బాలికల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 200 మంది విద్యార్థులకు జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా ఆర్టీసీ బస్ పాసులను అందజేశారు. ఒక్కో బస్‌పాస్ దరఖాస్తు, లామినేషన్‌కు అయ్యే రూ.50లు పేద విద్యార్థులకు ఆర్థిక భారం కాకూడదని సంస్థ నిధులతో ఆర్టీసీకి చెల్లించినట్లు సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. కౌన్సిలర్ శశికళ, ఆంజనేయులు, నాగభూషనం, గోపాల్‌గౌడ్, రాధాకృష్ణముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, సురేశ్, హెచ్‌ఎం అనిత, రమాదేవి, ఉమా, సునిత, ఆర్టీసీ సిబ్బంది రాంచందర్‌యాదవ్, బస్వయ్య, శ్రీనివాస్, నాగరాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలపై హెచ్‌ఎండీఏ కమిషన్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ వెంచర్లు, అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయాలని స్థానిక వార్డు సభ్యులు హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు స్థానిక వార్డు సభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి, నాలా, రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని, అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా స్థానిక కార్యదర్శి పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఫిర్యాదులో నరేశ్, జంగమ్మ పేర్కొన్నారు.



## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



జవహర్‌నగర్‌లో తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు బీఆర్ఎస్, బీజేపీకి చెందిన యువకులు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. యువతకు ఉద్యోగాలు, నూతన పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ప్రజలు వారిని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నం తరుణ్‌గౌడ్, కొత్త సుశాంత్‌గౌడ్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ తోటకూర అజయ్‌యాదవ్, ఉప్పుగల ప్రశాంత్, రాజు, సదానంద్, రాజుయాదవ్, రజిత, సుగుణ, ధనమ్మ, కొత్తకొండ వేణు, శ్రీను, ఆనంద్, శ్రవణ్, సుమన్, లక్ష్మి, సునీత, ప్రమీల, అజయ్, సోమేష్, రాజశేఖర్, సాయి, మధు, రవి, అనిల్, ఇస్సాక్, కార్తీక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి విరాళం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని పలు ఆలయాల అభివృద్ధికి మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి సోమవారం విరాళం అందజేశారు. శివారెడ్డిగూడ దండ్లగడ్డ వీరాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో షెడ్డు నిర్మాణం, ఎన్ఎఫ్‌సీనగర్‌లోని మహంకాళి అమ్మవారి ఆలయం, లింగాల కుంట ఆలయం అభివృద్ధికి విరాళం అందజేశారు. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులుగౌడ్, అనురాధ, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, నరేశ్‌గౌడ్, సత్యనారాయణ, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్ రావు, సిరాజ్ పాల్గొన్నారు.

## తుమ్మ చెరువు కట్టపై సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తుమ్మచెరువు కట్టపై సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి ప్రారంభించారు. మంత్రి మల్లారెడ్డి సొంత ఖర్చులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. పట్టణ ప్రజలు ప్రధాన మార్గాల ద్వారా వెళ్తుంటే ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు తుమ్మ చెరువు కట్టను అభివృద్ధి చేసి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. చాలా కాలనీలకు ఈ రోడ్డు వల్ల సమస్యలు తీరతాయని బస్‌డిపోనకు రైల్వే స్టేషన్‌కు మరింత కనెక్టివిటీ పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మానస శ్రవణ్ కుమార్‌గుప్తా, ప్రియాంక మధుకర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకుడు రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

### బీరప్పగుడిలో మంత్రి పూజలు

పోచారం: యమ్నంపేట్‌లోని బీరప్ప గుడిలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీరప్ప గుడి అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థికసాయం చేస్తానని హామీ ఇచ్చారు.

### బాలికలకు ఆరోగ్య పరీక్షలు

కీసర: కీసరగుట్ట, అంకిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి సందర్శించారు. బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కొంతమంది బాలికల్లో కంటి ఇన్‌ఫెక్షన్స్ గుర్తించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకాంతం, ఏఎన్‌ఎం రాణి, ఆశ వర్కర్లు, సాయి, లత తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ వినూత్న నిరసన



జవహర్‌నగర్‌లో మంత్రుల చిత్రపటాలకు పిండ ప్రదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్: వరద బాధితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. సోమవారం చెన్నాపురం చెరువు వద్ద సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిల చిత్రపటాలకు పిండ ప్రదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు పలు కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే కాలనీలను గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్లెపల్లి సదానంద్, కన్నయ్యరాజు, కాయిత రాజుయాదవ్, మందుల రజితగోపాల్, సుగుణ, ధనమ్మ, కొత్తకొండ వేణు, శ్రీనివాస్, రాజుయాదవ్, వినయ్‌కుమార్, సుమన్, సరిత, లక్ష్మి, సునీత, భాగ్యలక్ష్మి, సునీల్, అజయ్ పాల్గొన్నారు.




## ప్రహరీ గోడ, గేటును తొలగించాలి



ఘట్‌కేసర్: నిబంధనలను తుంగలో తొక్కి వెంచర్ చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ, గేటును తొలగించాలని మర్పల్లిగూడ గ్రామవాసులు పంచాయతీ కార్యదర్శికి సోమవారం ఫిర్యాదు చేశారు. మర్పల్లిగూడ గ్రామంలోని సర్వే నంబర్-12, 13లో చేసిన వెంచర్ చుట్టూ నిబంధనలు పాటించకుండా ప్రహరీ గోడ నిర్మించారని, ప్రజావసరాల కోసం వదిలిపెట్టిన స్థలంలో పల్లె ప్రకతి వనం, నర్సరీని ఏర్పాటు చేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీకి వెళ్లకుండా అడ్డుకునేందుకు గోడ నిర్మించి గేటు ఏర్పాటు చేశారన్నారు. ఉప సర్పంచ్ నరేశ్, వార్డు సభ్యుడు ఆనంద్, స్థానికులు మైసయ్య, శ్రీశైలం, మల్లయ్య, అజీజ్, గోవర్ధన్, బాలకృష్ణ, శివకుమార్, కల్యాణ్, భిక్షపతి, సత్తయ్య ఉన్నారు.

### పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

కీసర: కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల గ్రామంలో పేకాట స్థావరంపై సోమవారం మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. చీర్యాల గ్రామంలోని ఓ ఇంట్లో కొన్నిరోజులుగా పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు కీసర పోలీసుల సహకారంతో దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వ్యక్తుల నుంచి రూ.27,120, నగదు, 5 సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకొని కీసర పోలీసులకు అప్పగించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్‌సీ ఇప్పించాలి

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు 30 శాతం పీఆర్‌సీ ఇప్పించాలని కోరుతూ సోమవారం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డికి బీఆర్ఎస్‌టీయూ కాప్రా సర్కిల్ అధ్యక్షుడు జి.కుర్మన్న వినతి పత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు, జీహెచ్‌ఎంసీలో పని చేసే ప్రతి కార్మికుడికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, కార్మికుల దినోత్సవం రోజు సెలవు ఇప్పించాలని కోరారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి తమ డిమాండ్లను అమలు చేయాలని కోరారు.

### 'కేఏ పాల్‌తో తమకు సంబంధం లేదు'

మేడ్చల్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో మేడ్చల్ మండల పాస్టర్ల సంఘానికి ఎలాంటి సంబంధం లేదని మండల పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం క్రైస్తవుల శాంతి ర్యాలీ సందర్భంగా కేఏపాల్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తాము కేఏ పాల్‌ను ఆహ్వానించకున్నా ఆయనే వచ్చి బీజేపీ, బీఆర్ఎస్‌లను విమర్శించి తన రాజకీయ పబ్బం గడుపుకున్నారని అన్నారు. మంత్రి మల్లారెడ్డిని విమర్శించడం తాము ఖండిస్తున్నామని అన్నారు. తన రాజకీయం కోసం క్రైస్తవుల ర్యాలీని వాడుకోవాలని చూశారని అన్నారు. పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జాకబ్, సెక్రటరీ రాంబాబు, సభ్యులు జార్జన్, తిమోతిపాల్, సోలోమెన్‌రాజు, కట్టయ్య, డేవిడ్, రాజశేఖర్, సిద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.